మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర    సంపుటి : 08    సంచిక : 149    గురువారం    20 - 11 - 2025    పేజీలు: 8    వెల: 4

## మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టాలి



3లో..

# అన్నదాత నిధులు విడుదల


- రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేసిన ప్రభుత్వం
- పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ రెండో విడత విడుదల
- రాష్ట్రంలోని 47 లక్షల మంది రైతులకు రూ.3,200 కోట్ల కేటాయింపు
- ఒక్కో రైతు ఖాతాలో రూ.7,000 చొప్పున డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్



కడప, మన గళం :

ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాల కింద రెండో విడత నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా విడుదల చేశారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం, రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 47 లక్షల మంది అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా రూ.3,200 కోట్లు జమ అయినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో రైతు ఖాతాలో 2లో..

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



- రాష్ట్ర ఆర్థిక శాఖ మరియు జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్

మనగళం, బేతంచర్ల : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం, పెల్లిమర్రి మండలంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 2025 26 సంవత్సరానికి సంబంధించి రెండవ విడత రైతులకు ఖరీఫ్ కు చేయూతగా అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా బేతంచెర్ల 2లో..



## ట్రిబ్యునళ్ల చట్టంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- కేంద్రం చేసిన స్వల్ప మార్పులు సరిపోవు - సుప్రీంకోర్టు స్పష్టం

మన గళం, న్యూఢిల్లీ : ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం అత్యంత కీలక నిర్ణయం వెలువరించింది. గతంలో రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తేవడం రాజ్యాంగ విరుద్ధమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బృందం స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం చట్టంలో చేసిన మార్పులు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ చట్టంలోని నియామకాలు, సర్వీసు కండీషన్లు, పదవీకాలానికి సంబంధించిన 2లో..

# బిర్సా ముండా సేవలు చిరస్మరణీయం



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల ఆరాధ్యదైవం భగవాన్ శ్రీ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని విశాఖపట్నం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురామ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జన జాతీయ గౌరవ దివాస్ బహిరంగ సభ కు సంబంధించిన బ్రౌచర్, ప్రెస్ మీట్ లో మాధవ్ పాల్గొన్నారు. బిర్సా ముండా త్యాగాలను ఈ సందర్భంగా మాధవ్ గుర్తు చేశారు. గిరిజనుల స్వేచ్ఛకు బిర్సా ముండా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

## స్టాళ్లను తిలకించిన ఒడిశా సీఎం



మనగళం, ప్రత్యేక ప్రతినిధి : స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల ఆరాధ్యదైవం భగవాన్ శ్రీ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని పాడేరులో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ హాజరయ్యారు. ఈ సందర్భంగా బహిరంగ సభ ప్రాంగణంలో బిర్సా ముండాకు సంబంధించి ఏర్పాటు చేసి స్టాళ్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తో కలిసి ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ తిలకించారు.

## భారత్‌లో భారీ దాడులకు
# జైషే కుట్ర



- ఢిల్లీ పేలుడుతో బయటపడుతున్న జైషే ముఠా కొత్త ప్లాన్
- 'మేడమ్ సర్జన్' నేతృత్వంలో డిజిటల్ ఫండింగ్ నెట్‌వర్క్
- మహిళలతో ప్రత్యేక ఉగ్ర యూనిట్ 'జమాతుల్-ముమినాత్' ఏర్పాటు


మన గళం, న్యూఢిల్లీ : ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ జైషే మహ్మద్ సంస్థ చేసిన కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు జరుపుతున్న ఈ సంస్థ భారత్ వ్యాప్తంగా భారీ దాడులకు సిద్ధమవుతోందని నిఘా సంస్థలు గుర్తించాయి. ముఖ్యంగా దేశంలో 2లో..



# పాపం సీఐలు..!

- ☐ 22 నెలలు గడవకముందే ముగ్గురు బదిలీ
- ☐ ప్రభుత్వం మారినా... పాలకులకు నచ్చకపోయినా తప్పని తిప్పలు
- ☐ గోనెగండ్ల పోలీస్ స్టేషన్ పరిస్తితి ఇది

మనగళం, గోనెగండ్ల : రాజకీయ బలం ముందు అధికార బలం తలవంచక తప్పడం లేదు. కేవలం 22 నెలలు గడవకముందే ముగ్గురు సీలు బదిలీ అయిన తీరు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. కర్నూలు జిల్లా గోనెగండ్ల పోలీస్ స్టేషన్ నుంచి రెండేళ్లలోపే ముగ్గురు సీఐలు బదిలీ కావడం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా లో గత వైసీపీ ప్రభుత్వ హయంలో ఐదు పోలీసు స్టేషన్స్ న్లు అప్ గ్రేడ్ అవ్వగా ఒకటి గోనెగండ్ల. ఎస్ ఐ ఉంటున్న స్థానం లో సీఐని నియమించారు ఉన్నతాధికారులు. గోనెగండ్ల మండలం లో 20 గ్రామ పంచాయతీలు, 7 మజరా గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న తిమ్మారెడ్డిని సి. బెలగల్ కు బదిలీ చేసి...05-02-2024 నా ఏ. రామకృష్ణయ్య ను గోనెగండ్ల సీ ఐ గా నియమించింది అప్పటి వైసీపీ ప్రభుత్వం. 12-06-2024 న టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేజిక్కించుకుంది. కేవలం రెండు నెలల లోపే ఏ. రామకృష్ణయ్యను బదిలీకి పచ్చజెండా ఊపారు ఉన్నతాధికారులు. దీంతో 07-08-2024న ఏ. గంగాధర్ గోనెగండ్ల సీ ఐ గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీస్ ను అమలుపరిచి ప్రజల సమస్యలు పరిష్కరించడంలో సీఐ గంగాధర్ కృషి మరువలేనిది. అలాగే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తులపై కఠినంగానే వ్యవహరించారు కూడా. అయినప్పటికీ 13- 03- 2025 ఏ. గంగాధర్ రిలీవ్ అయ్యారు. అధికార 2లో..



## టీచర్ అయిన.. జిల్లా కలెక్టర్



- చిన్నారులతో మమేకమైన వైనం
- నేలపై కూర్చుని పాఠాలు చెప్పిన రాజకుమారి

మనగళం, బేతంచర్ల : నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కొద్దిసేపు టీచర్‌గా మారారు. బేతంచర్ల మండలంలోని ఓ అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ చిన్నారులతో మమేకమయ్యారు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఏకంగా పిల్లలతోపాటు నేలపై కూర్చుని ముచ్చటించారు. పిల్లల నోట్ పుస్తకాలు తెరిచి 2లో..

# ట్రిబ్యునళ్ల చట్టంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

పలు నిబంధనలను ముందే సుప్రీంకోర్టే కొట్టివేసిందని, వాటిని స్వల్ప మార్పులతో తిరిగి ప్రవేశపెట్టడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని కోర్టు హెచ్చరించింది. అధికార వికేంద్రీకరణకు విరుద్ధంగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయాల్సిన అవసరమే లేదని స్పష్టం చేసింది.

దీంతోపాటు, ట్రిబ్యునళ్ల సభ్యుల పదవీకాలంపై గతంలో ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం పునరుద్ధరించింది. ముఖ్యంగా ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్, కస్టమ్స్-ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునళ్ల సభ్యులు 62 ఏళ్ల వరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. ట్రిబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లు కొనసాగుతుందని తెలిపింది. ఈ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. 2021లో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణల చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సహా పలు అప్పిలేట్ ట్రైబ్యునళ్లు రద్దయ్యాయి. అలాగే సభ్యుల నియామక నిబంధనల్లో గణనీయ మార్పులు జరిగినవి. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ ముగిసిన తర్వాత కోర్టు తీర్పును రిజర్వ్ చేయగా, ఇప్పుడు కీలక వ్యాఖ్యలతో తీర్పును ప్రకటించింది. ఈ తీర్పుతో ట్రిబ్యునళ్ల వ్యవస్థపై కేంద్రం చేసిన మార్పులకు గట్టి చెక్‌పెట్టినట్లు న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం, పారదర్శకతను కాపాడేందుకు ఈ తీర్పు కీలక మలుపుగా గుర్తిస్తున్నారు.

# భారత్‌లో భారీ దాడులకు జైషే కుట్ర

ఫిదాయిన్ దాడులను అమలు చేయాలన్న ప్రయత్నాలు జరుగుతున్నట్లు దర్యాప్తు నివేదికల్లో స్పష్టమవుతోంది. పాకిస్థాన్‌లోని ఆన్‌లైన్ ఛానళ్ల ద్వారా జైషే ముఠా విరాళాలు సేకరిస్తున్న విషయం దర్యాప్తు అధికారులు బయటపెట్టారు. 'ముజాహిద్ వింటర్ కిట్స్' పేరుతో 20 వేల పాకిస్థాన్ రూపాయల (భారత కరెన్సీలో రూ.6,400) చొప్పున డొనేషన్లు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ నిధులతో బూట్లు, ఉల్లెన్ సాక్స్, టెంట్లు, మెట్రెస్‌లు వంటి సామగ్రిని ఫిదాయిన్ దళాలకు అందించాలనే ప్లాన్ తో ముందుకు సాగుతున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌కు చెందిన సదాపే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌ల ద్వారా ఈ విరాళాలు స్వీకరిస్తున్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. ఈ ఆన్‌లైన్ ఫండింగ్ నెట్‌వర్క్‌లో 'మేడమ్ సర్జన్'గా వ్యవహరించే డాక్టర్ షాహీనా సాయిద్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తేలడం సంచలనంగా మారింది. ఎర్రకోట పేలుడులో ప్రధాన అనుమానితుల్లో ఒకరిగా ఉన్న ఆమె ఈ విరాళాల నిర్వహణ బాధ్యతను నేరుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. డాక్టర్ షాహీనా సాయిద్ పాత్ర బయటపడడంతో ఆమె ఆధ్వర్యంలో నడుస్తున్న డిజిటల్ ఫండింగ్ వ్యవస్థపై దర్యాప్తు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నిధుల ద్వారా భారత్‌లో దాడులను అమలు చేయాలన్న ప్రయత్నాలు స్పష్టమవుతున్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉగ్ర చర్యలకు కావాల్సిన వనరులను సమకూర్చడమే ఈ నెట్‌వర్క్ లక్ష్యమని అధికారులు భావిస్తున్నారు. ఇదివరకు బయటపడిన సమాచారంలో మరింత భయంకరమైన అంశం వెలుగులోకి వచ్చింది. జైషే మహ్మద్ సంస్థ మహిళలతో కూడిన ప్రత్యేక యూనిట్ 'జమాతుల్-మునినాత్'ను ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ ఈ యూనిట్‌ను నడుపుతున్నట్లు సమాచారం. మహిళలకు ఆన్‌లైన్ జిహాదీ కోర్సులను అందిస్తూ ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రేరేపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కోర్సుల ద్వారా భారత్‌లోని మహిళలను కూడా ఆకర్షించేందుకు కుట్రలు పన్నుతున్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ప్రత్యేకంగా 'మేడమ్ సర్జన్' షాహీనా సాయిద్‌కు జైషే మహిళా విభాగం బాధ్యతలు అప్పగించడంతో ఈ నెట్‌వర్క్ మరింత శక్తివంతమైందని అధికారులు భావిస్తున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లను వినియోగించి సోషల్ రిక్రూట్‌మెంట్ కార్యకలాపాలు వేగంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎర్రకోట పేలుడు కేసులో షాహీనా పాత్ర స్పష్టమవుతున్న కొద్దీ భారత నిఘా సంస్థలు ఈ కొత్త మహిళా ఉగ్ర యూనిట్‌పై దృష్టి పెంచాయి. దేశంలో మహిళలను టార్గెట్ చేసే ఈ కుట్రలు పెద్ద ముప్పుగా మారే అవకాశముండటంతో కేంద్ర సంస్థలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. భారత్ అంతటా డిజిటల్ ఫండింగ్, ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ నెట్‌వర్క్‌లపై కఠిన నిఘా కొనసాగుతూనే ఉంది. జైషే కార్యకలాపాలు నిరంతరం మారుతున్న తరుణంలో, ఆన్‌లైన్ మార్గాల ద్వారా నిధుల సేకరణ, మహిళల మోహాన్ని ఉపయోగించుకునే కొత్త విధానాలు దర్యాప్తు సంస్థలకు పెద్ద సవాళ్లుగా మారాయి. ఢిల్లీ పేలుడుతో బయటపడుతున్న ఈ కుట్రల నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం అవుతున్నాయి.

# టీచర్ అయిన ... జిల్లా కలెక్టర్



తప్పొప్పులను పరిశీలించారు. తప్పులను ఓ టీచర్ లా సవరించారు. జిల్లా కలెక్టర్ హోదా తెలియని ఆ చిన్నారులు తమ టీచర్ తో ఉన్నట్లే మసులకున్నారు. ఏ మాత్రం బెనుకు లేకుండా కలిసిపోయారు. జిల్లా కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు చకచకా సమాధానాలు చెప్పారు. కలెక్టర్ సైతం చిన్నారులు చెప్పిన సమాధానాలకు మురిసి పోయారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చిన్నారులతో మమేకమైన తీరును చూసిన అధికారులు, అంగన్ వాడీ టీచర్లు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు.

# పాపం సీఐలు !

పార్టీ నేతల ఆశీస్సులతో 13- 03- 2025 నా గోనెగండ్ల సీఐగా బాధ్యతలు చేపట్టిన ఓ విజయభాస్కర్ 8 నెలల పదవి కాలాన్ని పూర్తిచేసుకున్నాడో లేదో... ఈనెల15న బదిలీ ఉత్తర్వులు అందాయి. రాత్రికి రాత్రే రిలీవ్ అయ్యారు. గోనెగండ్లకు సీఐను నియమించకుండానే విజయ భాస్కర్ ను బదిలీ చేయడం ఓ చర్చగా మారింది. అంత అత్యవసరం ఏమటనే గుసగుసలు వినిపించాయి. ఏ రామకృష్ణయ్యను ఎలక్షన్ ముందు వైసీపీ ప్రభుత్వం నియమించడం వలన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు నెలల్లో బదిలీ చేశారు. అధికార పార్టీ ఆశీస్సులతో గోనెగండ్ల సీఐగా బాధ్యతలు చేపట్టిన ఏ గంగాధర్ స్థానిక నాయకులకు సహకరించడం లేదని బదిలీ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే గోనెగండ్ల మూడవ సీఐగా పనిచేసిన విజయ్ భాస్కర్ బదిలీకి పలు రకాలుగా వినిపిస్తున్నాయి. స్థానిక నాయకులకు అనుకూలంగా పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇద్దరు కానిస్టేబుల్స్ ను మధ్యవర్తులుగా పెట్టుకొని దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలనే చందంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. రాజకీయ కుట్ర అనే వ్యక్తులు లేకపోలేదు. ఏదిఏమైనా సీఐలు ఇక్కడ నుంచి బదిలీ అవుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో గోనెగండ్ల సీఐ వచ్చేందుకు ఆశావహులు ఇప్పటికే రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గోనెగండ్ల అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ దృష్టిలో ఉంచుకొని ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే సీఐని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


# అన్నదాత నిధులు విడుదల

రూ.7,000 చొప్పున డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ రూపంలో నిధులు చేరాయి. రైతులకు పెట్టుబడి సీజన్‌లో పెద్ద ఊరటగా ఈ ఆర్థిక సహాయం మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పెండ్లిమర్రిలో పర్యటించిన సీఎం చంద్రబాబు ముందుగా 'మన గ్రోమోర్' ఎరువుల కేంద్రాన్ని సందర్శించి, స్థానిక రైతులతో మాట్లాడారు. పంటల వ్యయం, మార్కెట్ ధరలు, నీటి సమస్యలు వంటి అంశాలపై వారితో చర్చించిన సీఎం, రైతుల అభ్యున్నతికి ప్రభుత్వమంతా కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. అనంతరం సభ ఏర్పాటుచేసిన వేదిక నుంచి నిధుల విడుదల బటన్‌ను నొక్కారు. ఈ పథకంలోని కేంద్ర ప్రభుత్వ భాగమైన పీఎం%-%కిసాన్ సమ్మాన్ నిధిని ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూర్ నుంచి విడుదల చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు అందిస్తున్న ఈ సహాయం పంటల సాగు, ఎరువులు, నీటి ఖర్చులు వంటి ముఖ్య వ్యవసాయ కార్యకలాపాలకు తోడ్పడుతుందని ప్రభుత్వం పేర్కొంది. రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది మరో ముఖ్య అడుగు. పంటల సీజన్‌లో రైతులకు ఈ ఆర్థిక మద్దతు నిజమైన భరోసాగా నిలుస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.





# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం




మండలం, యంబాయి గ్రామంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ జిల్లా స్థాయి కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, డోంట్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర్ యాదవ్, వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని... ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం విశేష కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. యంభాయ్ గ్రామంలో హార్టికల్చర్ ఎక్కువగా ఉందని ఈ ప్రాంతం మొత్తం గ్రీనరీ తో నిండి ఉంది. యంభాయ్ గ్రామం లాగా ప్రతి గ్రామం కూడా హార్టికల్చర్ వైపు వెళ్లాలని ఈ ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. 1994 సంవత్సరం నుంచి తాను రాజకీయాల్లో ఉన్నాను అప్పటినుంచి ఇప్పటివరకు కొంతమంది ముఖ్యమంత్రులు కొంతవరకు పని చేశారని కేవలం గత ఐదు సంవత్సరాల నుంచి మాత్రమే రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. మన భవిష్యత్తుని మన పిల్లల భవిష్యత్తును కాపాడే నాయకుడు చంద్రబాబు అని, 75 సంవత్సరాలు వచ్చిన ఆయన 24 గంటలు ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దాలనే తపనతో ముందుకు వెళుతున్నారన్నారు. గతంలో రైతులకు ఎటువంటి సబ్సిడీలు లేవని, నేడు సబ్సిడీతో రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అమరావతి నిర్మాణాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. రాబోయేలో రోజులలో ఈ రాయలసీమ ప్రాజెక్టులన్నింటినీ అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత పరుగులు పెట్టిస్తామని చంద్రబాబు నాయుడు నాయకత్వానికి మనమందరం సహాయ సహకారాలు ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు చేయూతను అందించాలనే ధృడ సంకల్పంతో పాటు రైతులకు పెట్టుబడి సాయానికి ఇబ్బంది లేకుండా ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత-సుఖీభవ పథకం ద్వారా ద్వారా 14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా 6 వేల రూపాయలు మొత్తంగా ప్రతి రైతుకు సంవత్సరానికి 20వేల రూపాయలను మూడ దఫాలుగా అందించడం జరుగుతోందన్నారు. మొదటి విడతలో జిల్లాలోని 2,06,052 మంది రైతులకు అన్నదాత-సుఖీభవ పథకం క్రింద 5 వేలు, పిఎం కిసాన్ పథకం క్రింద రూ.2 వేలు మొత్తంగా రూ.140.57 కోట్లు అందించామన్నారు. జిల్లా ఎక్కువగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఖరీఫ్ లో 2.36 లక్షల హెక్టార్లలో ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిరప, బెంగాల్ గ్రామ్, రెడ్ గ్రామ్ పండిస్తున్నారని, రబీలో 1.90 లక్షల హెక్టార్లలో వరి, మొక్కజొన్న, బెంగాల్ గ్రామ్, మిరప, పత్తి పంటలు పండిస్తున్నామన్నారు. రాష్ట్రం మొత్తంలో 40 శాతం మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారన్నారు. రైతులు ఎక్కువగా మిశ్రమ పంటలు, అంతర పంటల మీద దృష్టి సారించాలన్నారు. పంట మార్పిడి విధానాలను పాటించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఒకే పంటను పలుమార్లు వేయడం ద్వారా భూసాంద్రత తగ్గి కార్బన్ కంటెంట్, భూమిలోని సూక్ష్మ పోషకాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తుందని తద్వారా భూసాంద్రత పెరిగి రైతులకు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో లక్ష ఎకరాల వరకు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అందుకు రైతులు అందరూ సహకారం అందించాలన్నారు. డోన్ శాసనసభ్యులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తాను రాజకీయాలకు రాకముందే రైతునని, రైతుల కష్టాలు కూడా తనకు చాలా బాగా తెలుసన్నారు. తాను కూడా మామిడి, చీనీ పంటలు వేయడం ద్వారా తనకు రైతుల కష్టాలు బాగా తెలుసన్నారు. డోన్ కొండ ప్రాంతమని నీటి కొరత ఎక్కువగా ఉంటోందని, ఎక్కువ శాతం వర్షాధారం మీదనే రైతులు ఆధారపడాల్సి ఉంటుందన్నారు. అందుకు గాను గోరుకల్లు రిజర్వాయర్ నుండి 2 నుండి 3 టిఎంసి నీరు అందజేయడం వల్ల నియోజకవర్గానికి నీటి సమస్య ఉండదన్నారు. మార్చి మాసం పూర్తి అయ్యేనాటికి ప్రతి ఇంటికి అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాలకు సంబంధించి డోన్ నియోజకవర్గం లోని 35011 మంది రైతులకు 23.63 కోట్ల రూపాయల మెగా చెక్కును మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా, కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ గా గుర్తించిన రహదారి ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడింగ్, రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ లను నెల లోపు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పోలీస్ శాఖ ప్రతిపాదించిన విధంగా ఆర్ అండ్ బీ, నేషనల్ హై వేస్ కు సంబంధించిన రోడ్లలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ రోడ్లలో బ్లైండ్ కర్వ్ లు ఉన్న చోట రెండు మూడు నెలలకు ఓసారి బుష్ క్లియరెన్స్ చేయాలని, అలాగే ఎండిపోయిన చెట్లను తొలగించాలని కలెక్టర్ ఎస్ ఈ లను ఆదేశించారు. జాతీయ రహదారుల లో మీడియన్స్ నిర్వహణ సరిగ్గా లేదని, సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు. ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను డిసెంబర్ 10 వ తేది లోపు పూర్తి చేసి హ్యాండోవర్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు కు సంబంధించిన ప్రతిపాదనలను రివైజ్ చేసి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి పంపాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ ను ఆదేశించారు. ఆటోల్లో వెనుక వైపు ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ అంశంపై ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని కలెక్టర్ డీటీసీ శాంత కుమారి ఆదేశించారు. మోటార్ వెహికల్ యాక్సిడెంట్ ఫండ్ ద్వారా యాక్సిడెంట్ జరిగిన బాధితులకు ఏడు రోజులలోపు రూ. 1.5 లక్షల వరకు క్యాష్ లెస్ మెడికల్ ట్రీట్మెంట్ ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ పథకం ద్వారా బాధితులకు సహాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ట్రాన్స్పోర్ట్ డీటీసీని ఆదేశించారు. రహ్- వీర్ పథకం కింద మోటార్ వెహికల్ ప్రమాదానికి గురైన బాధితులను గోల్డెన్ అవర్ లో ఏం వచ్చింది మెడికల్ కేర్ అందించి కాపాడిన వారికి గుడ్ సమరిటన్ గా అభినందిస్తూ రూ. 25 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పిస్తా హౌస్ నుండి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరకు ఇల్యూమినేషన్ పనులు వెంటనే చేయాలని హైవే, ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.






చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదం జరిగిన చోట పగులగొట్టిన డివైడర్ ను వెంటనే నిర్మించాలని నేషనల్ హై వేస్ అధికారులను ఆదేశించారు. ఓర్వకల్లు రోడ్ లో రెండు కి.మీ యూ టర్న్ ఉన్నందున, ఎంత చెప్పినా ఆపోజిట్ లో వాహనాలు వస్తున్నాయని, ఆ అంశం మీద తగిన పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, నేషనల్ హై వే ప్రాజెక్ట్ డైరెక్టర్ లు, పంచాయతీ రాజ్ ఎస్ ఈ వేణుగోపాల్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టాలి

**– జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్**

మనగళం, కర్నూలు సిటీ : గంజాయి, మాదకద్రవ్యాల రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాలలు,కళాశాలలు, యూనివర్సిటీల్లో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల వద్ద హోర్డింగ్స్ కూడా ఏర్పాటు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని సచివాలయాల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, 1972 టోల్ ఫ్రీ నెంబర్ కలిగిన పోస్టర్లను ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొన్నిచోట్ల పంటపొలాల్లో సాధువులు విత్తనాలు ఇచ్చి గంజాయి సాగు చేస్తున్నారని, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు గుర్తించి, పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు హైదరాబాదు నుంచి డ్రగ్ అడిక్షన్ కిట్స్ తెప్పించాలని డీఎంహెచ్వో ను ఆదేశించారు.



అన్ని పాఠశాలల్లో ఈగిల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని డీఇఓ ను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ శాంతకుమారి, ఈగల్ ఎస్పై సుజన్ కుమార్, డీఎంహెచ్ డా.భాస్కర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**– ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు**



మనగళం, కర్నూలు సిటీ : వైద్యులు, సిబ్బంది సమన్వయంతో మెలగాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని ఆసుపత్రి అడిషనల్ డీఎంఈ, సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుదవారం డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఆర్ఎంఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగ సేవల నాణ్యతను పెంచడం, సిబ్బంది బాధ్యతలను స్పష్టంగా నిర్వహించడంపై దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి లోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. హెడ్ నర్సింగ్ సేవలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అదేవిధంగా ఆసుపత్రిలో అడ్మిషన్లు ఉన్న పేషెంట్లకు కలెక్టర్ ఆఫీస్ సమీపాన పుల్లారెడ్డి స్వీట్స్ షాప్ పక్కన ఉన్న సాలమ్మ సత్రం రూమ్ లను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించే చర్యలు తీసు కోవాలని సూచించారు. డిప్యూటీ సూప రింటెండెంట్లు డా. నాగేశ్వరరావు, డా. లక్ష్మీబాయి, సీఎస్ఎంఓ పద్మజ, ఆర్ ఎంఓ డా. వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డా. శివబాల తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలను తనిఖీలు చేయాలి

**– నగరపాలక కమిషనర్ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో ఉన్న 137 సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేలా పర్యవేక్షించాల్సిన పూర్తి బాధ్యత ఇటీవల నియమించిన నోడల్, సహాయ నోడల్ అధికారులదే అని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. బుధవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా నూతన నోడల్, సహాయ నోడల్ అధికారులతో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు సచివాలయాల్లో మెరుగైన ప్రభుత్వ సేవలు పొందేలా 15 మంది నోడల్ అధికారులు, వారికి సహాయంగా మరో 15 మందిని సహాయ నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ప్రతి వారం కేటాయించిన సచివాలయాల్లో నోడల్, సహాయ నోడలు అధికారులు తనిఖీలు చేసి, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం 14 రకాల సేవల ప్రక్రియ జరుగుతుందని, వాటిల్లో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా సంబంధిత నోడల్, సహాయ నోడల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా వీరి నుండి ఎప్పటికప్పుడు నివేదికలకై సమన్వయం చేసుకుంటూ, ఉన్నతాధికారులకు అందజేసేందుకు ఒక్కొక్క విభాగం నుండి ఒక్కొక్కరు చొప్పున ప్రత్యేకంగా 7 మంది కార్యదర్శులను నియమించామన్నారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఎంతో అవసరమని, బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే వారిని ప్రోత్సహిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి



మనగళం, కర్నూలు సిటీ : స్థానిక ముజఫర్ నగర్ 32వ వార్డు లోని తెలకపల్లి నరసింహయ్య గ్రంథాలయంలో కమిటీ కార్యదర్శి వడ్డెమాను ధనేష్ అధ్యక్షతన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీ.ఎన్ గ్రంథాలయ అధ్యక్షులు కె.ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులందరు గ్రంథా లయాన్ని ఉపయోగించుకోవాలని, జ్ఞానాన్ని పెంపోందించు కోవాలని కోరారు. ముజఫర్ నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆజాద్, తారక్, చిన్న, ఆనంద్ నాగిరెడ్డి, రమేష్, విజయ్, గ్రామ పెద్దలు సాయిబాబా, పాఠశాల ప్రధా నోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్య రక్షణ

**– నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.వి.జీ.వి.కృష్ణ**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యమైన సమాజం సాధ్యమని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ అన్నారు. బుధవారం నగరంలోని బీ.కాంప్స్ గర్ల్స్ హై స్కూల్‌లో 'డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడం, వాటిని పద్ధతిగా వినియోగించడం సమాజ ఆరోగ్యానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత, అలాగే మలవిసర్జన తర్వాత చేతులు కడుక్కోవడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని వివరించారు. ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్‌లో సేవలందిస్తున్న ఆయాలకు శాలువా కప్పి సన్మానించారు. పచ్చదనాన్ని పెంపొందించాలనే సందేశంతో స్కూల్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పుల్లన్న, హుసేన్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ నాగరాజు




మనగళం, కర్నూలు సిటీ : కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, మరియు ప్రజా పంపిణీ పై నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ, అనంతరం మంత్రి కార్యాలయం లో ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు జిల్లాలోని ఆహార శాఖ కు సంబంధించిన పలు అంశాల పై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తో చర్చించారు.

# దోర్నాలలో భక్తుల వసతి సౌకర్యాల కోసం టిటిడి బోర్డు ముందడుగు

మన గళం పెద్ద దోర్నాల: శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పోతుగంటి రమేష్ నాయుడు చొరవతో, భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాల కల్పన దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. గతంలో టీటీడీ ఈవో గారితో నిర్వహించిన సంప్రదింపుల్లో భాగంగా, శ్రీశైలం వచ్చే భక్తుల సౌకర్యార్థం దోర్నాలలో వసతి మరియు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన నేపథ్యంలో, టీటీడీ ఈవో గారి సూచన మేరకు ఈరోజు టిటిడి ధర్మకర్తల బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి దోర్నాలను సందర్శించారు. శ్రీశైల దేవస్థానానికి సంబంధించిన భూములను పరిశీలించిన ఆయన, భక్తులకు మరింత మెరుగైన వసతి సౌకర్యాలు ఎలా అందించాలన్న అంశంపై పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా, సంబంధిత సమాచారాన్ని టీటీడీ ఈవో తో పాటు శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌తో చర్చించి, కార్యక్రమం అమలుకు త్వరలోనే శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



## చిన్నారులకు పోషకాహారం అందించాలి

- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, బేతంచర్ల : అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. బుధవారం బేతంచెర్ల మండలంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు సంపూర్ణ పోషణలో భాగంగా గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు, స్టెంటెడ్ పిల్లలకు కూడా అంగన్వాడీ కేంద్రాలలో ఆహారం తినేలా చూడాలని, వారికి

ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను వేయించాలని సూచించారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రంలోని హాజరు పట్టిని ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. గర్భిణీ స్త్రీలకు అవసరమైన కిట్లను సమయానికి అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రంలో ఫ్యాన్లు, మంచినీరు వంటి మౌలిక వసతులు ఉన్నాయా లేదా అని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## రైతులకు అండగా కూటమి సర్కార్



మనగళం, ఓర్వకల్లు : కూటమి సర్కార్ రైతులకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తుందని పాణ్య%శీ% ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. మండల కేంద్రం ఓర్వకల్లు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత పాణ్య%శీ% ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత రెడ్డి గారి ముఖ్య అతిథులుగా పాల్గొని రైతుల ఖాతాల్లోకి నగదు విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో టీటీడీ బోర్డు మెంబర్,టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్,విశ్వ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, రామాంజనేయులు,మండల తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఓ నాగ అనసూయ, ఏడీఏ రాజశేఖర్, ఏడిఏ డిఆర్సి వేదమని,వ్యవసాయ శాఖ అధికారులు మధుమతి, విష్ణువర్ధన్ రెడ్డి,పవన్, జయ ప్రతాప్ రెడ్డి,రాష్ట కార్పొరేషన్ డైరెక్టర్ లు నాగముని, వద్దు లక్ష్మీ దేవి, పాణ్య%శీ% మార్కెట్ యార్డ్ చైర్మన్ అంగజాల గీత,ఓర్వకల్లు మండలం టీడీపీ అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి,పాణ్య%శీ% మండల అధ్యక్షుడు గనపం జయరామి రెడ్డి,గడివేముల మండలం అధ్యక్షుడు పంట దిలీప్ కుమార్ రెడ్డి,కర్నూలు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి,నియోజకవర్గం సొసైటీ చైర్మన్ లు నాగేశ్వర రెడ్డి,సుధాకర్ రెడ్డి, సుధాకరయ్యా ,ఉలిందకొండ ఈవీ రమణ, పర్ల శేఖర్,దేశం సత్యం రెడ్డి,నరేంద్ర రెడ్డి, ఆలమూరు చంద్రశేఖర్ రెడ్డి,ఉపాధ్యక్షుడు నార్ల మోహన్ రెడ్డి,ఓర్వకల్లు మండల నాయకులు గోవింద్ రెడ్డి, రామ భూపాల్ రెడ్డి,లక్ష్మీ కాంత రెడ్డి, యేసోబు,ప్రభాకర్ యాదవ్,మరియు రైతులు,అధికారులు,కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# సూపర్ సిక్స్ హామీలు టిడిపి తోనే సాధ్యం

- లోటు బడ్జెట్ ఉన్నా హామీలు అమలు చేస్తున్న చంద్రబాబు. ఆర్థిక మంత్రి పయ్యావుల.
- రైతుల పక్షపాతి చంద్రబాబు అన్న కోట్ల.
- రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు విడుదల.





మన గళంబేతంచర్ల మండలంలోని యాంబాయి గ్రామంలో జరిగిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరియు నంద్యాల జిల్లా ఇంచార్జ్ మినిస్టర్,ఆర్థిక పయ్యావుల కేశవ్ మరియు యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక మాత్రమే కాకుండా జాతీయ ఆర్థికవ్యవస్థకు పునాది అని అన్నారు. రైతు బలపడితే కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం బలపడతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన రైతు కుటుంబానికి నేరుగా ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు. రాబోయే ఆరు నెలలలో డోన్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి తెప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులు పంట సాగు నుండి మార్కెట్ వరకు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వం గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. పంటల నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు, నీటి సదుపాయాలు, పంట బీమా ం ఇవన్నీ రైతు ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికే ఉద్దేశ్యమని చెప్పారు. పథక ప్రయోజనాలు ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రతి అర్హులైన రైతు కుటుంబానికి చేరేలా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణలో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థాయి వాలంటీర్లు, వ్యవసాయ విభాగం అధికారులు, రైతు సంఘాలు మరియు ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తేఈ పథకం మరింత ముందుకు వెళుతుంది అని ఎమ్మెల్యే చెప్పారు. డోన్ నియోజకవర్గానికి చెందిన 35011 మంది రైతులకు (లబ్ధిదారులు) 23 కోట్ల 63 లక్షల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజా కుమారి గణియ , ఆర్డిఓ నరసింహులు , డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ కెసి హరి , సంబంధిత శాఖ అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు




## శ్రీ శ్రీ శ్రీ వెంకటగిరి గిడ్డ ఆంజనేయస్వామి సన్నిధానంలో కార్తీక అమావాస్య సందర్భంగా రాష్ట్రస్థాయి భజన పోటీలు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని శ్రీ శ్రీ శ్రీ వెంకటగిరి గిడ్డ ఆంజనేయస్వామి సన్నిధానంలో కార్తీక అమావాస్య సందర్భంగా రాష్ట్రస్థాయి భజన పోటీల నిర్వహిస్తున్నారు ఈ భజన పోటీల కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త , రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యులు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డిని ఆహ్వానించడానికి వెంకటగిరి గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షుడు గిరిబాబు మరియు వెంకట రెడ్డి , బిఆర్ రాముడు, మహేశ్వర్ రెడ్డి, వెంకట శివుడు, మద్దిలేటి, గిడ్డయ్య ,నాగేశ్వరరావు, గుర్రమ్మగారు శివ, పాల గిరిబాబు, మాధులు ,రాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఆహ్వానించడం జరిగింది అలాగే ప్రజలందరూ ఈ భజన పోటీలకు విరివిగా విచ్చేసి భజన పోటీలు తిలకించి స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని వారు పిలుపునిచ్చారు

## సుందరయ్యనగర్‌లో మురుగునీరు నిల్వ - దోమల విజృంభణతో అల్లాడిపోతున్న ప్రజలు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని సుందరయ్యనగర్‌లో మురుగు పారుదల వ్యవస్థ దెబ్బతినడంతో వీధులంతా మురుగునీరు నిల్వగా మారింది. ఎక్కిరిపోయిన కాల్వల వల్ల మురుగునీరు ఇళ్ల ముందు వరకు చేరి ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంతా దుర్వాసనతో ఊపిరి పీల్చలేని పరిస్థితి నెలకొంది మురుగునీటి నిల్వ కారణంగా దోమల సంఖ్య భారీగా పెరిగిపోవడంతో డెంగూ, మలేరియా వంటి వ్యాధుల భయం స్థానికులను వేధిస్తోంది. "పిల్లలు తరచూ జ్వరాలతో బాధపడుతున్నారు. వీధుల్లో తిరగలేని పరిస్థితి. అనేకసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు కనిపించడం లేదు" అని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. మురుగు కాల్వలను శుభ్రపరచి, శాశ్వత పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు గ్రామపంచాయతీ అధికారులకు కోరుకుంటున్నారు.




## పిల్లల భవిష్యత్తు కోసం అద్భుత అవకాశాలు..

హైదరాబాద్, నవంబర్ 19, మన గళం:

ప్రతి తల్లిదండ్రికి పిల్లల భవిష్యత్తు సురక్షితం చేయడం ప్రధాన బాధ్యత. పిల్లల చదువులు, వారి జీవన అవసరాల కోసం డబ్బులను సమయానుకూలంగా ఆదా చేయడం అత్యంత ముఖ్యం. చిన్న పెట్టుబడితో ఎక్కువ రాబడిని పొందే అవకాశాల కోసం %×జ×జ×% ప్రుడెన్షియల్ చిల్డ్రన్స్ మ్యూచువల్ ఫండ్ ప్రత్యేకంగా రూపొందించబడింది.

ఈ ఫండ్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బు ఎక్కువకాలం పండుతూ, పిల్లలు పెద్దవారయ్యే సమయానికి సగటు ఆదాయాన్ని అందిస్తుంది. కేవలం రూ.10 లక్షల పెట్టుబడితో, సుమారు 24 ఏళ్ల తరువాత రూ.3 కోట్ల వలె పెరుగే అవకాశం ఉంది. ఫండ్‌లో పెట్టుబడి ఈక్విటీ లేదా డెట్ ఆప్షన్లలో చేయవచ్చు. ఐదు సంవత్సరాల లాక్-ఇన్ పీరియడ్ లేదా పిల్లలు పెద్దవారయ్యే వరకు ఫండ్ రక్షించబడుతుంది. ఫండ్ వార్షికంగా సుమారు 15.58 శాతం రాబడిని అందిస్తుంది. పిల్లల భవిష్యత్తు కోసం ప్రారంభ పెట్టుబడి త్వరగా పెడితే, ఎక్కువ బెనిఫిట్ ఉంటుంది. నెలవారీగా పెట్టుబడిని కొనసాగించడం ద్వారా, పిల్లలు ఉన్నత విద్య కోసం సిద్ధం అయ్యే సమయంలో పెద్ద మొత్తంలో డబ్బు సులభంగా అందుతుంది అంతేకాక, తల్లిదండ్రులు తమ విలాసాలను కొంచెం తగ్గించి, క్రమబద్ధమైన ఆర్థిక ప్రణాళికతో ఈ ఫండ్‌లో పెట్టుబడి పెడితే, పిల్లల భవిష్యత్తుకు పటిష్టమైన ఆర్థిక భద్రతను అందించవచ్చు. ఇది పిల్లల కై అత్యంత భద్రతా హామీ ఇస్తూ, తల్లిదండ్రులకు శాంతిని ప్రసాదించే మార్గం అవుతుంది. ఈ ఫండ్ ద్వారా పిల్లల కోసం పెట్టుబడి పెట్టడం కేవలం ఆదా కాదు, భవిష్యత్తులో సమృద్ధిగా తయారవ్వడానికి ఒక ప్రణాళికగా మారుతుంది.



# సంపాదకీయం

ఇందిరా గాంధీ జయంతి ప్రత్యేక
దేశ నిర్మాణంలో అమోఘ నాయకత్వం
సామాజిక న్యాయానికి సాహసోపేత నిర్ణయాలు
సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొన్న ఉక్కుమనిషి

స్వతంత్ర భారత దేశ చరిత్రలో అమరమైన ముద్ర వేసిన నాయకురాలు, ఉక్కుమహిళగా పేరు తెచ్చుకున్న భారతరత్న ఇందిరా గాంధీ జయంతి దేశవ్యాప్తంగా స్ఫూర్తిదినంగా సాగుతోంది. గమనించిన ప్రతిభా ప్రకాశం, అమలైన సంకల్పబలం, దేశ సమగ్రత కోసం తీసుకున్న కీలక నిర్ణయాలు ఇవన్నీ ఆమెను ప్రపంచ వేదికపై ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. పేదల సంక్షేమానికి, మహిళా సాధికారతకు, భారతదేశ ఆర్థిక, రక్షణ బలపాటుకు ఆమె చూపిన దూరదృష్టి ఇప్పటికీ రాజకీయ చరిత్రలో దిక్సూచిగా నిలుస్తుంది. ఇందిరా గాంధీ నాయకత్వం దేశం ఎదుర్కొన్న అత్యంత క్లిష్టమైన కాలాలకు మార్గదర్శకంగా నిలిచింది. ఆర్థిక సంక్షోభం, బాహ్య బెదిరింపులు, అంతర్గత అశాంతి ఏ సమస్య వచ్చినా దాన్ని దేశ ప్రయోజనాల కంటే పైకి పెట్టలేదు. “గర??ాహటావో” అన్న నినాదంతో పేదల సంక్షేమానికి ఆమె ప్రారంభించిన సామాజిక ఆర్థిక సంస్కరణలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పును తీసుకువచ్చాయి. ముఖ్యంగా బ్యాంకుల జాతీయాకరణ నిర్ణయం కోట్లాది ప్రజలకు రుణాలు, సేవలు అందించేలా చేసింది. దేశ భూభాగం, సమగ్రత దెబ్బతినే పరిస్థితుల్లో కూడా వెనుకడుగు వేయని ధైర్యం ఇందిరాగాంధీదే. 1971 భారత –పాకిస్థాన్ యుద్ధంలో ఆమె తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలు బంగ్లాదేశ్ పుట్టుకకు కారణమయ్యాయి. ఆ యుద్ధ విజయం ప్రపంచ రాజకీయ పటంలో భారతదేశాన్ని అగ్రశ్రేణి దేశాల సరసన నిలబెట్టింది. ఆ సంక్షోభ సమయంలో ఆమె ప్రదర్శించిన ధీశాలి నాయకత్వాన్ని ప్రపంచం నేడు కూడా గౌరవంతో గుర్తుచేసుకుంటోంది.

మహిళా సాధికారత, విద్య విస్తరణ, సాంకేతికాభివృద్ధి వంటి రంగాల్లో కూడా ఇందిరా గాంధీ చేసిన పనులు గణనీయమైనవి. యువతలో శాస్త్ర సాంకేతికాలపై ఆసక్తి పెంచేందుకు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణపై ముందు చూపుతో చర్యలు తీసుకోవడం, ప్రపంచ వేదికపై భారతదేశం తరపున ధైర్యంగా స్వరం వినిపించడం ఆమె దార్శనికతకు నిదర్శనం. ప్రపంచ దేశాధిపతుల మధ్య ఆమెకు ఉన్న గౌరవం భారతదేశ ప్రతిష్ఠను పెంచింది. గ్రామీణాభివృద్ధి మరియు వ్యవసాయ రంగంలో ఆమె తీసుకున్న నిర్ణయాలు కూడా ముఖ్యమైన మైలురాళ్లు. పచ్చి విప్లవం ద్వారా భారతదేశాన్ని ఆహార వైపరీత్యం నుంచి బయటకు తీయడానికి అవసరమైన బలమైన ప్రణాళికలను అమలు చేసింది. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం ఇండ్ల నిర్మాణం, జీవనోపాధి అవకాశాలు వంటి అంశాలు ఆమె భవిష్యత్ దృష్టిని ప్రతిబింబించాయి. జాతీయ సమైక్యత, ధార్మిక సామరస్యానికి ఇందిరాగాంధీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారు. విభిన్న మతాలు, సంస్కృతులు, భాషలు కలిసిన భారత సమాజంలో ఐక్యతను కాపాడటానికి ఆమె ప్రాధాన్యత ఇచ్చింది. దేశ భద్రతను కాపాడటం కోసం వ్యవస్థలను బలపరిచిన ఆమె కఠిన నిర్ణయాలు అప్పట్లో విమర్శలు ఎదుర్కొన్నా, తర్వాత కాలంలో వాటి ప్రాముఖ్యత స్పష్టమైంది. దేశం, ప్రజలు, పేదలు ఇవే ఆమె రాజకీయాల కేంద్రబిందువులు.

ఇప్పటికీ కోట్లాది భారతీయుల హృదయాల్లో నిలిచిపోయిన ఈ ఉక్కుమహిళ భారతీయ ప్రజాస్వామ్యానికి అందించిన సేవలు అపారమైనవి. ఆమె చూపిన మార్గదర్శకత్వం, ధైర్యం, దృఢనిశ్చయం, ప్రజల పట్ల ప్రేమ ఇవన్నీ భవిష్యత్ తరాలకు స్ఫూర్తి స్రవంతులు. దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల మధ్య ఆమె చూపిన సంకల్పబలం నేటి నాయకత్వానికి కూడా పాఠం చెబుతోంది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా, ఆమె స్ఫూర్తిని స్మరించుకోవడం అంటే పేదల మేలు కోసం, దేశ సమగ్రత కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేయాలనే సంకల్పాన్ని పునరుద్ధరించుకోవడం. ప్రజల అభ్యున్నతి, దేశ అభివృద్ధి, సామాజిక సమానత ఇవే ఆమె కలల భారతదేశం. ఆ కలను సాకారం చేయడం మనందరి బాధ్యత.

# అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు విడుదల

మన గళండోన్ జిల్లా లో రైతుల కలల్లో ఆనందం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి అన్నారు వారు మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక మాత్రమే కాకుండా జాతీయ ఆర్థికవ్యవస్థకు పునాది అని అన్నారు. రైతు బలపడితే కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం బలపడతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ‘అన్నదాత సుఖీభవ’ పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన రైతు కుటుంబానికి నేరుగా ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు .డోన్ నియోజకవర్గానికి చెందిన 35011 మంది రైతులకు (లబ్ధిదారులు) 23 కోట్ల 63 లక్షల రూపాయలు జమచేశారు అన్నారు .ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాబీజేపీ మాజీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు %ఎఖ% నాయుడు, రైతుసంగం నాయకులు కల్లూరి శివయ్య, ఉడల మధయ్యమరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొనరు



# పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథక రెండవ విడత

**– పత్తికొండ ఎమ్మెల్యే శ్రీ కే.ఈ. శ్యామ్ కుమార్ ప్రారంభించారు.**

ఎర్రగుడి రైతు సేవ కేంద్రం ఆవరణలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. పథకం లబ్ధిదారులైన మహిళా రైతులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ గారు పీఎం కిసాన్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడే అన్నదాతలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిజం చేస్తోందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో అత్యంత ప్రాధాన్యమైన అన్నదాత సుఖీభవ కింద రెండవ విడతగా రాష్ట్ర ప్రభుత్వం వాటా ?5,000, కేంద్రం వాటా ?2,000 కలిపి రైతుల ఖాతాల్లో మొత్తం ?7,000 జమ చేస్తున్నట్లు చెప్పారు. పత్తికొండ నియోజకవర్గంలో 54,774 మంది రైతులకు ?27.387 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు వివరించారు. అలాగే ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రైతులను నిర్లక్ష్యానికి గురిచేశారని,




వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ పరికరాలు అందించలేదని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ పరికరాలను సబ్సిడీతో అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వేగంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు

# ఒంగోలులో బీజేపీ నేతల ఘన సన్మానం

**– రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా పి.వి. శివరెడ్డి**

ఒంగోలు జిల్లా బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన మాజీ జిల్లా అధ్యక్షుడు పి.వి. శివరెడ్డి గారిని ఘనంగా సత్కరించారు. ఒంగోలు జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ జగ్గం శ్రీనివాసులు గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కోంద్రు పిచెయ్య, ఎర్రగొండపాలెం బీజేపీ ఇన్చార్జి ఏనుముల నాగేశ్వరరావు, ఎర్రగొండపాలెం మండల అధ్యక్షుడు మాదాల సూర్యనారాయణ, దోర్నాల మండల మాజీ అధ్యక్షుడు యస్. వీరారెడ్డి, పెద్దారవీడు మాజీ మండల అధ్యక్షుడు బొచ్చు కోటిరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు బొచ్చు మల్లారెడ్డి తదితరులు పాల్గొని శివరెడ్డి గారిని శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శివరెడ్డి గారి నియామకం పార్టీకి గర్వకారణమని, ఆయన భవిష్యత్తులో మరిన్ని




ఉన్నత స్థానాలు అలంకరించాలని ఆకాంక్షించారు.

# అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ 2025- 26 రెండవ విడత నిధుల విడుదల





మన గళం కర్నూలు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆదేశానుసారం %ఖణణజ% ఛైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి సూచనల మేరకు కోడుమూరు నియోజకవర్గం కర్నూలు రూరల్ మండలం ఆర్. కొంతలపాడు గ్రామంలో అన్నదాత సుఖీభవ – పిఎం కిసాన్ 2025– 26 రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మరియు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగింది అని అన్నారు.రైతులకు రెండో విడతగా రూ. 7 వేల సహాయాన్ని జమ చేయటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల కు ఏటా 20000 రూపాయలు అందజేయడం జరుగుతుందని అందులో ఈ ఏడాది కింద రెండో విడతగా కేంద్ర వాటా 2000 రూపాయలు %ూవీ ఖ×ూూచీ% పథకం ద్వారా మరియు రాష్ట్ర వాటా కింద 5000 రూపాయలు మొత్తం మీద 70000 రూపాయలు ఈరోజు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా ఈరోజు రాష్ట్రం మొత్తం మీద 46.85 ,837 మంది రైతులకు రెండవ విడతలో భాగంగా 3135 కోట్ల రూపాయలు జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు.సీఎం చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటూ, రైతు కుటుంబాలకు నేరుగా లాభం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని వారు ఈ సందర్భంగా తెలియజేశారు అర్హులైన రైతులు చనిపోయిన పక్షంలో వారి వారసులకు అర్హత బదిలీ (డెత్ మ్యుటేషన్) చేసి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.రైతులు ఎన్ పి సి ఐ వినియోగంలో లేని ఖాతాలను తిరిగి వినియోగంలోకి తెచ్చుకుంటే వెంటనే నిధులు జమ అయితాయని తెలియజేశారు.దాదాపు 6310 కోట్లు 2 విడతలుగా అందించడం జరిగిందన్నారు.రైతులకు పంటల ఉత్పత్తి ఖర్చులను సవరించి, రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఉపయోగపడనుందన్నారు .రైతుల కష్టానికి గౌరవంగా, ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా ఈ పథకం అమలు అవుతోందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు టీడీపీ మండల కన్వీనర్లు , రైతు సంఘం నాయకులు , వివిధ సంఘాల డైరెక్టర్లు కర్నూలు మండల %వీ=ూ వీూణూ% ,అగ్రికల్చరల్ అధికార యంత్రాంగం , కూటమి నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మన ఊరు మన పచ్చదనం...



నందవరం నవంబర్ 19 మన గళం న్యూస్..: నందవరం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈరోజు పరిశుభ్రత మరియు పచ్చదనం కలిగిన గ్రామపంచాయతీ అనే థీమ్ 5 మీద ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నందవరం మండలంలోని అందరూ సర్పంచులు మరియు ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నందవరం మండల పరిషత్ కార్యాలయం నందు నిర్మించడం అయినది. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం గ్రామ సర్పంచులు మరియు ప్రజలు నిర్వహించవలసిన బాధ్యతల గురించి మరియు ప్రభుత్వం చేసే కార్యక్రమాల గురించి ముఖ్యంగా ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి, సోక్ పిట్, ప్రతిరోజు ఇంటి నుండి చెత్త సేకరణ, గ్రామంలో చేపడుతున్న డ్రైన్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్ పచ్చదనం పెంపుదల కోసం ఇనిస్ట్యూషనల్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ మొదలు వాటి గురించి తెలియ పరచి వాటిని సరైన విధంగా సద్వినియం చేసుకోవాలని తెలపడం అయినది. పై వాటి గురించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగులదిన్నె పంచాయతీ కార్యదర్శి వివరించారు.

## అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల.

- అన్నదాత సుఖీభవ రైతులకు ఇదొక వరం. - నియోజకవర్గంలో 63,317 మంది రైతులకు చేకూరనున్న లబ్ధి, వైకుంఠం జ్యోతి.





( ఆలూరు మనగళం : ఆలూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ చెంగలరాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని 63,317 మంది రైతులకు మొత్తం 42 కోట్లు 8 లక్షల రూపాయలు కూటమి ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేసిందని తెలిపారు. ఒక్కో రైతుకు రెండో విడత కింద రూ. 7,000 చొప్పున రైతులకు అకౌంట్లో నేరుగా జమ అవుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను వేగంగా అమలు చేస్తోందని తెలియజేశారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి పెన్షన్ రూ. 250 పెంచగా, ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు ఒకేసారి రూ. 1,000 పెంచడం ద్వారా వృద్ధులు, అర్హులకు పెద్ద సహాయం అందిందని ఆమె పేర్కొన్నారు. అలాగే ప్రతి మండల సొసైటీలకు కోటి రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని వివరించిన ఆమె, రైతులు తక్కువ వడ్డీతో రుణాలు పొంది వ్యవసాయంలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల ప్రతిభకు దేశం గర్విస్తోంది.

- ఆలూరు మరియు మొలగవెల్లి గ్రంథాలయ అధికారి కె విజయభాస్కర్.





( ఆలూరు మనగళం ) ఆలూరు మరియు మొలగవల్లి శాఖా గ్రంథాలయం నందు 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమం సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది తదుపరి గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ఈ రోజు మన దేశ అభివృద్ధిలో మహిళల ధైర్య సాహసాలు చాలా గొప్పవని వీరు సమాజాభివృద్ధిలో చాలా పెద్ద పాత్ర పోషిస్తున్నారని తెలిపారు కావున ప్రతి ఒక్క మహిళ ఒక వీర నారిలా ముందుకు వెళ్ళాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని అదేవిధంగా ప్రతీ ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని విద్యార్థులకు పాఠకులకు తెలియచేసారు తదుపరి ఇద్దరు మహిళలు సభ్యత్వం తీసుకోవడం జరిగినది అలాగే రేపు అనగా 20/11/2025 న 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని అలాగే ఇంతవరకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు కావున ప్రతి ఒక్కరూ పాల్గొని 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జయప్రదం చేయాలని అలాగే గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరడం జరిగినది. ఈ రోజు కార్యక్రమం లో మొలగవల్లి నందు మహిళా ఉపాధ్యాయులు తో మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగినది. ఆలాగే ఆలూరు నందు మహిళా ఉపాధ్యాయులతో మహిళా దినోత్సవం నిర్వహించడం జరిగినది అదేవిధంగా ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వారోత్సవాలకు సహకరించిన ఘాజీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీ ఆసియా బేగం గారిని సన్మానించడం జరిగినది ఈ కార్యక్రమమాలలో పాల్గొన్న వారు గ్రంథాలయ అధికారి కె విజయభాస్కర్ గారు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు పాఠకులు పాల్గొన్నారు.

## బ్రేకులు లేవు ఎక్స్ లెటర్ మాత్రమే..



మన గలం బ్రహ్మగిరి:-శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళ్లే భక్తులు బ్రహ్మగిరి గ్రామం గుండా ప్రయాణం చేస్తుంటారు బ్రహ్మగిరి గ్రామంలో స్పీడుబ్రేకర్ లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ చెక్పోస్ట్ మొదలుకొని పాతాళ గంగ గ్రామం వరకు రోడ్డు పూర్తిగా డౌన్ స్లోప్ ఉండడంతో వాహనాలు అధిక వేగంతో దూసుకొస్తున్నాయి దీంతో స్కూలుకు వెళ్లే పిల్లలు వృద్ధులు రోడ్డు దాటాలంటే భయం భయంగా దాటాల్చి వస్తుంది నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి ముఖ్యంగా మన రాష్ట్రం నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా శ్రీశైలం మల్లన్న దర్శనానికి భక్తులు ఈ రహదారి గుండెని ప్రయాణం చేస్తుంటారు శని ఆదివారాలు సెలవు దినాలు శ్రీశైలం దర్శనానికి వెళ్లి భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుంది ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియడం లేదు గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే స్కూల్ అంగన్వాడి కేంద్రాలు ఉండడంతో పిల్లలు రోజు రోడ్డు దాటాల్చి వస్తుంది వృద్ధులు కూడా మార్కెట్ కు వెళ్లడం ఏ ఇతర పనులకు వెళ్లాలన్న మెయిన్ రోడ్డుకు రావాల్సిందే ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ సమస్యను తీర్చి గ్రామంలో స్పీడ్ బ్రేకులు వేయించాలని సంబంధిత అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు

## ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు-1కు పిఎంశ్రీ సౌకర్యాలు.






(ఆలూరు మనగళం): ఆలూరులో మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల -1 లో విద్యార్థులకు పిఎంశ్రీ సెకండ్ ఫేస్ కింద ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ లాబ్ మెటీరియల్ ను మరియు విద్యార్థులకు హెచ్ ఎం,మరియు పాఠశాల ఉపాధ్యాయులకు నాన్ టీచింగ్ వారికి గుర్తింపు ఐడి కార్డ్ ల సౌకర్యాలను కూడా కల్పించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సుధారాణి మీడియాతో మాట్లాడుతూ పిఎంశ్రీ సౌకర్యాలు మన పాఠశాలకు సెకండ్ ఫేస్ కింద అందించడం సంతోషకరమని అలాగే త్వరలో విద్యార్థులను ఎక్స్పోజర్ విజిట్ కు తీసుకు వెళ్లడానికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. డిసెంబర్ 5న జరిగే మెగా (పీటిఎం) ను జయప్రదం చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని - సిపిఎం







మన గళం గూడూరు: కర్నూలు జిల్లా లో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడంలో, జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ అన్నారు,,..

గూడూరు పట్టణం తో పాటు మండలంలోని గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కొరకు, మండల అభివృద్ధి కొరకు గూడూరు సిపిఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో జీపు జాత నిర్వహించడం జరిగింది, జీపు జాత మండలంలోని అన్ని గ్రామాలలో తిరిగి సాయంత్రం గూడూరుకు చేరుకుంది, గూడూరులో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జే మోహన్ అధ్యక్షతన గూడూరు బస్టాండ్ లో జరిగిన జీపు జాత బహిరంగ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ నారాయణ మాట్లాడుతూ..... జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులో నిర్మాణం, చేయడంలో జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నాయని, జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్న కూటమి ప్రభుత్వంలోని పాలకులు ఎవరు మాట్లాడడం లేదని, కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు ఎంపీలు అంతా సొంత ఆదాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు తప్ప జిల్లాలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యల గురించి ఆలోచన చేయడం లేదని, జిల్లాకు పదివేల కోట్లు కేటాయిస్తే ఇటు గుండ్రేవుల అటు వేదవతి రిజర్వాయర్లు నిర్మాణంతో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, జిల్లాలోని ప్రజలకు త్రాగునీరు సాగునీరు పుష్కలంగా అందుతుందని ఆ రకంగా వలసలను నివారించవచ్చు కానీ పాలకులు ఆ విధంగా ఆలోచన చేయడం లేదు,, అదేవిధంగా గూడూరు మండలంలో గ్రామాలలో ఇప్పటికే ప్రజా సమస్యలు పేరుకుపోయాయని వాటిని పరిష్కరించడంలో గత ప్రభుత్వ ఎమ్మెల్యేలు ప్రస్తుత ఎమ్మెల్యేలు పూర్తిగా వైఫల్యం చెందారని, గూడూరు పట్టణాన్ని మున్సిపాలిటీ చేసి ప్రజలకు పన్నుల బారాల వేశారే తప్ప అభివృద్ధి మాత్రం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గూడూరులో కొన్నేళ్లుగా త్రాగునీటి సమస్య ఉన్న గత ప్రభుత్వ పాలకులు ప్రస్తుత పాలకులు కూడా పట్టించుకోవడంలేదని, ఈ త్రాగునీటి సమస్య వేసవికాలం వచ్చిందంటే తీవ్రంగా ఉంటుందని, గత వైసీపీ ప్రభుత్వంలో గూడూరు పట్టణంలో 4 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మాణ పనులు ప్రారంభించే మధ్యలో ఆపేశారని, బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు పట్టా బుట్టా సర్దుకుని పనులు నిలిపివేశారని, కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్న ఆ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రస్తుత కూటమి పాలకులకు చేతులు రావడంలేదని, ఈ విధంగా గ్రామాలలో త్రాగునీటి డ్రైనేజీ సిసి రోడ్ల సమస్యలు ఉన్నాయని గత వైసిపి ప్రభుత్వం ఈ సమస్యల పైన పట్టించుకోలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ లాగే తయారయిందని, కాబట్టి గూడూరు పట్టణం తో పాటు మండలంలో ఉన్న ప్రజా సమస్యల ను వెంటనే పాలకులు అధికారులు పరిష్కరించకపోతే ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున సిపిఎం పార్టీ ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు,,, కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, గూడూరు సిపిఎం నాయకులు దానమన్న, మద్దిలేటి, మధు, బెలగల్ సిపిఎం నాయకులు ఖాజా హుస్సేన్, అక్బర్, హమాలి కార్మికులు మునెప్ప, సుంకన్న, నాగేష్, గోపి, శేఖర్, మాబు, మరియు హమాలి కార్మికులు పాల్గొన్నారు.

## భారత ఐఫోన్ యూజర్లకు శుభవార్త..

హైదరాబాద్, నవంబర్ 19, మనగళం: భారతీయ ఐఫోన్ యూజర్లకు అదిరే వార్త. టెక్ దిగ్గజం యాపిల్ తమ వినియోగదారులకు అందుబాటు ధరలో కొత్త యాపిల్ కేర్ ప్లస్ కవరేజీ అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ. 799కే రెండు సంవత్సరాలపాటు ఫోన్లకు సురక్షితమైన రక్షణ పొందవచ్చు ఐఫోన్ 13 నుంచి ఐఫోన్ 17 వరకు, అలాగే ఐఫోన్ ఎస్ఈలకు కూడా ఈ కవరేజీ వర్తిస్తుంది. యాపిల్ కేర్ ప్లస్ ద్వారా ఫోన్ పోగొట్టిపోతే లేదా చోరీకి గురైతే ఏడాదికి రెండు సార్లు రిపేర్ పొందవచ్చు. సాధారణంగా ఒక సంవత్సరం హార్డ్‌వేర్ వారంటీ మాత్రమే లభించగా, ఈ ప్లాన్ తీసుకుంటే రక్షణను రెండేళ్లపాటు పొడిగించుకోవచ్చు. ప్రమాదవశాత్తు జరిగే నష్టాలకు కూడా అన్‌లిమిటెడ్ రిపేర్ సదుపాయం ఉంటుంది. వినియోగదారులు కొత్త ఐఫోన్ కొనుగోలు చేసిన వెంటనే లేదా 60 రోజుల లోపు యాపిల్ కేర్ ప్లస్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. ఇది యాపిల్ ఉత్పత్తుల సెట్టింగ్స్ యాప్ ద్వారా చేసుకోవచ్చు. కవరేజీలో బ్యాటరీ రీప్లేస్‌మెంట్ సర్వీస్, 24 గంటల ప్రాధాన్యతా సపోర్ట్ వంటి లాభాలు ఉన్నాయి. రిపేర్‌లు యాపిల్ స్టోర్‌లు లేదా అథరైజ్డ్ సర్వీస్ ప్రొవైడర్ల వద్ద మాత్రమే జరుగుతాయి. దీంతో యాపిల్ ఒరిజినల్ విడిభాగాలే ఉపయోగిస్తుందని కంపెనీ హామీ ఇస్తోంది.

## ఘనంగా ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జయంతి



మనగళం, కోడుమూరు : కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండల బాలజీనగర్ బీజేపీ కార్యాలయంలో వీర వనిత ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్ మాట్లాడుతూ ఝాన్సీ రాణి లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక అని, తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా పోరాడరని గుర్తు చేశారు. తన బుద్ధి కుశలత, శౌర్య సాహసాలు, కార్య కౌశల్యంతో బ్రిటిషు వారిని గడగడలాడించిన వీరనారి అని కొనియాడారు. కార్యక్రమంలో కోడుమూరు అసెంబ్లీ రూరల్ మండల అధ్యక్షులు బెస్త ఈరన్న, నాయకులు తిరుమలేష్, నారాయణ లక్ష్మన్న, రాజేష్, రాఘవ, ఆచారి, వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.


# పరోక్షసేవగా బయలువీరభద్రస్వామివారి విశేషపూజ

మనగళం శ్రీశైలం : ఈ రోజు ( 19.11.2025) ఉదయానికి అమావాస్య ఘడియలు రావడంతో శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామి వారికి దేవస్థానం విశేషపూజలను నిర్వహిస్తున్నది. ఈ సాయంకాలం పూజాదికాలు నిర్వహించబడుతాయి. ప్రతీ మంగళవారం, అమావాస్యరోజులలో ఈ విశేషార్చనను జరిపించడం జరుగుతోంది. కాగా అమావాస్య రోజున భక్తులు కూడా పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించబడింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 39 మంది భక్తులు ఈ విశేషపూజలను జరిపించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండేకాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, పంజాబ్ తదితర ప్రదేశాల నుండి కూడా భక్తులు ఈ పూజలను జరిపించుకుంటున్నారు.కాగా ఈ పూజాదికాల కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం జరిపించబడుతుంది. ఈ స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడుతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, సర్వకార్యానుకూలత లభిస్తుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. కాగా ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతుంది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించే అవకాశం కల్పించబడుతుంది. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 / లను సంప్రదించవచ్చు.



# ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (19.11.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలావీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది



## శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం

మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (19.11.2025) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించ బడుతున్నాయి. ఈ ఉదయం సాక్షి గణపతి స్వామి వారికి పంచా మృతాలతోనూ,



పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# శ్రీశైల ధర్మకర్తల మండలి సమావేశం



మనగళం శ్రీశైలం : ఈ రోజు (19.11.2025) దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడుగారి అధ్యక్షన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించబడింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన శ్రీస్వామివార్ల ప్రధానార్చకులు, ప్రత్యేక ఆహ్వానితులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈనాటి సమావేశంలో మొత్తం 14 అంశాలు చర్చించబడ్డాయి. వీటిలో 11 అంశాలు ఆమోదించబడగా, 2 అంశాలను వాయిదా వేయడం జరిగింది. ఒక అంశం తిరస్కరించబడింది. సమావేశంలో తీసుకోబడిన ముఖ్యమైన నిర్ణయాల గురించి ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు వివరించారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక చెంచు గిరిజనులకు నెలలో ఒకరోజున శ్రీస్వామివారి స్పర్శదర్శనం ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసమై గిరిజనులకు దేవస్థానం గుర్తింపుకార్డులను కూడా అందజేస్తుందన్నారు.
- జనవరి 12వ తేదీ నుంచి 18వ తేదీవరకు మకరసంక్రాంతి బ్రహ్మోత్సవాలను నిర్వహింపజేయడం జరుగుతుందన్నారు. ఈ బ్రహ్మోత్సవాలను అత్యంతవైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోబడుతాయన్నారు. అన్ని ఏర్పాట్లను కూడా ప్రణాళికబద్ధంగా చేబడతామన్నారు. ముఖ్యంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయడం జరుగుతుందన్నారు.
- నంద్యాల జిల్లా, కొత్తపల్లి మండలం శివపురం గ్రామములోని శ్రీ కొలనుభారతి సరస్వతీ అమ్మవారి దేవాలయాన్ని శ్రీశైలదేవస్థాన దత్తత దేవాలయంగా నిర్వహింపజేయాలని దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సదరు దేవాలయానికి సంబంధించి భూములు, బంగారం, వెండి, ఎఫ్.డి.ఆర్‌లు మరియు నగదును దేవస్థానం ఏర్పాటు చేసిన అధికారుల బృందం మరియు ధర్మకర్తల మండలి సమక్షములో త్వరలో స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. కొలనుభారతీ ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఆలయాన్ని దర్శించే భక్తులకు కనీస సదుపాయాలను కల్పించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం జరుగుతుందన్నారు.
- డిసెంబరు 1వ తేదీ నుంచి శ్రీస్వామివారి స్పర్శదర్శనం మరియు అతిశీఘ్రదర్శనం భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాలను అందజేయడం జరుగుతుందన్నారు. స్పర్శదర్శనం ( రూ. 500/-లు రుసుము) భక్తులకు 100 గ్రాముల బరువుగల రెండు లడ్డుప్రసాదాలను మరియు అతిశీఘ్రదర్శనం (రూ. 300/-ల రుసుముతో అలంకారదర్శనం) 100 గ్రాముల బరువుగల ఒక లడ్డు ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రసాదాల అందజేతకుగాను టిక్కెట్టుతో పాటు భక్తులకు ప్రసాదం కూపను కూడా ఇవ్వబడుతుందన్నారు. భక్తులు దర్శనానంతరం ప్రత్యేక కౌంటరు నుండి ఈ లడ్డుప్రసాదాలను పొందవచ్చునన్నారు. ఇందుకు ప్రత్యేకంగా సాఫ్టువేరును కూడా రూపొందింపజేయడం జరుగుతుందన్నారు. సాఫ్టువేరు రూపకల్పన వల్ల పారదర్శకంగా టికెట్టుదారులకు ప్రసాదాలను అందజేసే వీలు కలుగుతుందన్నారు.
- ప్రధానాలయంలోని శ్రీగోకులాన్ని దాతల సహకారంతో సంప్రదాయరీతిలోనూ, కళాత్మకంగా ఆధునీకరింపజేయడం జరుగుతుందన్నారు. ఈ ఆధునీకరణ పనులకు శ్రీ నాగదుర్గాప్రసాద్, సాయిస్కిల్స్ కళామందిరం, హైదరాబాద్ వారు ఆధునీకరించేందుకుముందుకు వచ్చారన్నారు. ఆలయ వైదిక కమిటీ, ఇంజనీరింగ్ మరియు దేవస్థాన సహాయ స్థపతి సూచనలను అనుసరించి శ్రీగోకులాన్ని ఆధునీకరిస్తామన్నారు.
- భక్తులు సూచనలు, సలహాలు పొందేందుకు పలుచోట్ల ఫిర్యాదులు మరియు సలహాల పెట్టెను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా భక్తులు అందించే సూచనలను మరియు సలహాలను కూడా పొందడం జరుగుతుందన్నారు.
- భక్తులు ఆయా సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా పలుచోట్ల మరిన్ని డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.
- భక్తుల సౌకర్యార్థమై క్షేత్రపరిధిలో ప్రధానకూడళ్ళ వద్ద యాత్రిక సహాయ కేంద్రాలు ( మే ఐ హెల్ప్ యూ సెంటర్లు) ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సహాయ కేంద్రాలలో శివసేవకుల స్వచ్ఛందసేవలను వినియోగించుకోవడం జరుగుతుందన్నారు.

ఇంకా ధర్మకర్తల మండలి అధ్యక్షుల వారు మాట్లాడుతూ సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తులు అధిక సమయం దర్శనానికి వేచివుండకుండా త్వరితగతిన దర్శనాలు చేసుకునే విధంగా ఆయా ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సాధారణ భక్తుల సౌకర్యాల రూపకల్పన పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాలు



మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (19.11.2025) సుమాంజలి నాట్యాలయం, రాజమండ్రి వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్యకార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో వినాయక ప్రార్థన, తాండవనృత్యకరి, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు చందన, రమ్య, సుమ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. రెండవ కార్యక్రమములో భాగంగా శ్రీ విభూది లోవరాజు మరియు వారి బృందం, రాజమండ్రి వారిచే దక్షయజ్ఞంపై బుర్రకథ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రకు ఘన సన్మానం











(మన గళం,జడ్చెర్ల) : ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రకు ఘన సన్మానం జరిగింది. బుధవారం జడ్చెర్ల పట్టణంలోని ఓ హెూటల్ లో ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు ఉమ్మడి జిల్లాలు, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల సుమన్ టీవీ ఫ్రాంఛైసీ పార్ట్ నర్ నగరూరు రాఘవేంద్రకు ఈ సందర్భంగా ఆ ఉమ్మడి జిల్లాల సుమన్ టీవీ ఇన్ ఛార్జ్ మణి ప్రసాద్ ఆధ్వర్యంలో రిపోర్టర్లు శ్రీనివాస్, శరత్, వెంకటేష్, జలంధర్, మురళీక్రిష్ణ, క్రిష్ణ, అవినాష్, రాఘవేంద్ర, సాధిక్, సంజీవ్, తిరుపతి రెడ్డి,గోవర్ధన్,నరసింహ తదితరులు శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలనందజేసి, అభినందించారు. అనంతరం డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర రిపోర్టర్లకు వార్తల సేకరణలో, సంస్థ ఎదుగుదలలో భాగస్వామ్యం ఏ విధంగా ఉండాలనే దిశగా దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సుమన్ టీవీ కర్నూలు ఉమ్మడి జిల్లాల ఇన్ ఛార్జ్ ఎన్.జి.కిరణ్ కుమార్, సీనియర్ కరెస్పాండెంట్ యస్.బి.నందకిషోర్, హీరా ఇన్ సర్వీస్ అపార్టమెంట్ ఇంఛార్జ్ వేముల శివప్రసాద్, రిపోర్టర్ కిషోర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కాటం సాయి, సివిల్ ఇంజనీర్ గోపాల్,రిపోర్టర్లు మునుస్వామి, ముని యాదవ్, పర్ల శివ, కెమెరామెన్ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ బ్యాంకును సందర్శించిన టీజీ వెంకటేష్



మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని రెడ్ క్రాస్ సంస్థ రక్తనిధి కేంద్రాన్ని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ బుధవారం సందర్శించారు. రెడ్ క్రాస్ కార్యాలయ ఆవరణంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటికే కర్నూలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తలసేమియా వ్యాధి భారీన పడినవారు దాదాపు 1,000 మందికి పైగా ఉన్నారు. వీరందరికీ ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్లడ్ టెస్ట్ లు అలాగే రక్తమార్పిడి చేయవలసి ఉంటుంది. తలసేమియా వ్యాధికి గురైన వారు అత్యధికలు పేద, మధ్యతరగతి వర్గాల వారే. దీనితో వారు సరైన వైద్య సౌకర్యాలు లేక, సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. వీరికోసమై జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వారి కొరకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఒక భవనాన్ని నిర్మించాలని తలచింది. అందుకు మాజీ రాజ్యసభ సభ్యులు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. అందులో భాగంగానే ఈరోజు రెడ్ క్రాస్ సంస్థ బ్లడ్ బ్యాంకు ఆవరణంలోనే తలసేమియా వ్యాధి బాధితులకు భవనాన్ని ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని ఆ ప్రాంతాన్ని ఈరోజు పరిశీలించారు. ఈ భవనం ఏర్పాటు అయితే తల సేమియా వ్యాధి బారిన పడినవారు వారికి అవసరమైన రక్తం పొందడంతో పాటు, మిగిలిన అన్ని రకాల పరీక్షలను కూడా ఇక్కడే పొందే అవకాశం ఉంటుందని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తెలిపారు. భవిష్యత్తులో గర్భిణీలకు కూడా హెచ్ఐవీ తరహాలో తలసేమియా పరీక్షలు నిర్వహించి పుట్టబోయే బిడ్డలకు ఈ వ్యాధి భారీన పడకుండా కాపాడేందుకు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థకు మొదటి నుంచి మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని, అలాగే ముందు ముందు కూడా కొనసాగిస్తానని చెప్పారని గోవిందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె వి సుబ్బారెడ్డి, శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బాబురాజ్, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 85 వేల మార్క్ దాటిన సెన్సెక్స్

ముంబై,నవంబర్19, మనగళం,: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ చలనం మధ్య చివరకు బలమైన పెరుగుదల నమోదు చేశాయి. ఉదయం స్వల్ప ఒత్తిడితో ప్రారంభమైన సూచీలు, మధ్యాహ్నానికి కొనుగోళ్ల జోరుతో గట్టిగా కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్షియల్ రంగాల్లో కనిపించిన లాభాలు మార్కెట్ మొత్తానికే ఊపిరి పోశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు క్షీణించటం కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. సెషన్ ప్రారంభంలో సెన్సెక్స్ 84,643 పాయింట్ల వద్ద నష్టాల్లో ఆరంభమైంది. ఆ తర్వాత మరింత ఒత్తిడితో 84,525 కనిష్ఠం తాకినా, అక్కడి నుంచి బలంగా పుంజుకుంది. ఇంట్రాడేలో సూచీ అత్యధికంగా 85,236 పాయింట్ల వరకు ఎగసి, చివరకు 513 పాయింట్ల లాభంతో 85,186 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా అదే ధోరణిని అనుసరించి 142 పాయింట్లు ఎగబాకి 26,052 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్ సూచీ 0.3 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 0.4 శాతం బలహీనపడింది. నిఫ్టీ బ్యాంక్ వరుసగా మూడో రోజు రికార్డు సృష్టించి 59,264 పాయింట్ల గరిష్టాన్ని తాకడం మార్కెట్ వాతావరణాన్ని మరింత బలోపేతం చేసింది. ఐటీ రంగం 3 శాతం ఎగబాకి సూచీలను లాగగా, పీఎస్‌యూ బ్యాంకులు కూడా 1.2 శాతం లాభపడ్డాయి. మీడియా, రియాల్టీ రంగాలు మాత్రం స్వల్ప ఒత్తిడితో ముగిశాయి. షేర్ల ప్రదర్శన విషయానికి వస్తేహెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, విప్రో, మాక్స్ హెల్త్‌కేర్, టీసీఎస్ వంటి దిగ్గజాలు గట్టి లాభాల్లో ముగిశాయి. కెనడా విస్తరణ నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 4 శాతం దూసుకెళ్లాయి. ఇన్ఫోసిస్ షేర్లు రాబోయే బైబ్యాక్ నేపథ్యంలో 4 శాతం పెరిగాయి. మరోవైపు టీఎంపీవీ, కోల్ ఇండియా, మారుతి సుజుకి, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. వెస్టర్న్ రైల్వేస్ నుంచి తగిన ఆర్డర్ వచ్చినప్పటికీ జీఆర్ ఇన్ఫ్రా షేర్లు 2 శాతం పడిపోవడం విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. బయోకాన్ 3 శాతం నష్టపోగా, సెబీ హెచ్చరిక లేఖ నేపథ్యంలో నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ 1.2 శాతం క్షీణించింది.

రోజులో అత్యంత ముఖ్యమైన అంశంబీఎస్‌ఈలో 120కి పైగా స్టాక్‌లు తమ 52 వారాల గరిష్టాలను తాకాయి. భారత్ ఫోర్జ్, ఎం అండ్ ఎం ఫైనాన్షియల్, హీరో మోటోకార్ప్, టైటాన్, ఫెడరల్ బ్యాంక్, ఎస్‌బీఐ, బీహెచ్‌ఈఎల్ వంటి ప్రధాన కంపెనీలు కొత్త గరిష్టాలను నమోదు చేయడం మార్కెట్‌లో పాజిటివ్ సెంట్‌మెంట్‌ను మరింత పెంచింది. ఈ వారాంతానికి గ్లోబల్ సెంట్రల్ బ్యాంకుల నిర్ణయాలు, డాలరు విలువలో మార్పులు, క్రూడ్ ఆయిల్ ధరలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. ప్రస్తుతం మార్కెట్లలో కనిపిస్తున్న బలమైన కొనుగోళ్ల ధోరణి కొనసాగితే, సూచీలు మరింత ఎగిసే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అన్నదాతకు ప్రభుత్వం అండ

– అన్నదాత సుఖీభవ పథకం కింద 2,72,757 రైతులకు రూ.181.51 కోట్లు లబ్ది – జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





మనగళం, కోడుమూరు : అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, జిల్లాలో అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,72,757 రైతులకు రూ.181.51 కోట్లు లబ్ధి కలిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం కోడుమూరు నియోజకవర్గం ఆర్. కొంతలపాడు లో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ 2025– 26 రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, కోడుమూరు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం ఉల్లి పంటకి మంచి ధర పలికిందని చెప్పి, రైతులు ఈసారి ఎక్కువ మోతాదులో ఉల్లి పంటను వేయడం జరిగిందన్నారు. ఉల్లి పంట వేసేటప్పుడు సైంటిఫిక్ గా టెస్ట్ చేసి ప్రూవ్ అయిన మంచి విత్తనాల్ని వాడాలన్నారు. అటువంటి విత్తనాలు వాడకుండా లోకల్ గా పెంచే వెరైటీస్ విత్తనాలను వాడారని అంతే కాకుండా ఈ సంవత్సరం అకాల వర్షాలు రావడం వల్ల ఉల్లి పంట దెబ్బ తిందన్నారు. ఎత్తు మడులు వేసి అందులో ఉల్లి పంట నాటి ఉంటే వర్షం పడినా కూడా పంట దెబ్బతీనేది కాదన్నారు. మంగళవారం, బుధవారం రోజులలో వ్యవసాయ సంబంధిత అధికారులు, సిబ్బంది పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహిస్తున్నారన్నారు.. సంబంధిత కార్యక్రమాలలో ఉల్లి, మిరప, తదితర పంటలు ఎలా పెంచాలి? దాని తాలూకా మెలకువలు ఏంటి? ఏం టెక్నాలజీ వాడాలి? విత్తనం నాటడం దగ్గర నుండి హార్వెస్ట్ చేసే వరకు కూడా ఎలా చేయాలనే విషయాలను చెప్తూ ఉన్నారన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులు అందరూ పాల్గొని వ్యవసాయ అధికారులు చెప్పే సూచనలను పాటించాలన్నారు. ఇక్కడ ఊర్లో ఎక్కువగా వరి, తర్వాత మొక్కజొన్న, పత్తి పంటలను పండిస్తూ ఉన్నారని, వీటన్నిటిలో ఏమి టెక్నాలజీ వాడాలి ? ఎలాంటి విత్తనం వాడాలి ? ఏం చేస్తే బాగుంటుందనే విషయాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అదే విధంగా మిల్స్ అన్నిట్లో కూడా పత్తి కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 11 మిల్స్ ఓపెన్ చేసామన్నారు. ముఖ్యంగా పత్తి రైతులకి ఎటువంటి సమస్య వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందిస్తుందన్నారు. రాష్ట్రంలో కర్నూల్ జిల్లాలోనే ఎక్కువ పత్తి పంట పండుతుందన్నారు. స్లాట్ బుకింగ్ కి సంబంధించిన సమస్యను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. వాటిని కూడా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు చెప్పారన్నారు. సీసీఐ వారు కూడా కాటన్ మిల్స్ లో పత్తి తేమ శాతం 14 ఉన్నపటికీ కూడా రైతుల్ని వెనక్కి పంపించకుండా తీసుకుంటున్నారన్నారు. రైతులకి చిన్న సమస్య వచ్చినా ఏ పంటలలో ఏ సమస్య వచ్చినా కూడా ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంటుందన్నారు. మిల్స్ అన్ని ఓపెన్ చేస్తే బాగుంటుందని నంద్యాలలో కూడా రెండు, మూడు మిల్స్ లను ఓపెన్ చేసి ట్యాగ్ చేయమని రిక్వెస్ట్ చేయడం జరిగిందన్నారు .. పచ్చి మిర్చి పంటలో ఉన్న సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తున్నాము అన్నారు. రైతులు పండిస్తున్న అని పంటలకి మార్కెటింగ్ చేసే విధంగా ట్రేడర్ లతో సమావేశం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొక్కజొన్న కి సంబంధించిన ప్రొక్యూర్మెంట్ సెంటర్స్ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. ఇక్కడ నీరు పుష్కలంగా ఉందని వ్యవసాయం చేసే రైతులు అందరూ కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ రైతులను కోరారు. రసాయన పురుగుమందులు, రసాయన ఎరువులు వాడడం ద్వారా జబ్బులు కూడా ఎక్కువ వస్తున్నాయన్నారు. కాబట్టి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్తే బాగుంటుందని కలెక్టర్ రైతులను కోరారు. 1800 మంది పైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, వారందరితో మాట్లాడం జరిగిందన్నారు. 4 వేల రూపాయలు పెట్టుబడి పెడితే 60 వేలు లాభం వచ్చిందన్నారు. ఇంకొన్ని పంటల్లో 10 వేల రూపాయలు పెట్టుబడి పెడితే 70 వేల రూపాయలు లాభం వచ్చిందన్నారు. అదే విధంగా ఒకటే పంట మీద ఆధారపడకుండా 2, 3 రకాల పంటలు సాగు చేయాలని కలెక్టర్ రైతులను కోరారు. ఆయిల్ ఫామ్ సాగుకి సంబంధించి మొక్కలు అన్ని ఫ్రీగా ఇస్తారన్నారు. హెక్టార్ కి 5 వేల రూపాయలు పండించడానికి అలాగే దాంట్లో అంతర్ పంటలు పండించడానికి కూడా ఇంకొక 5 వేల రూపాయలు ఇస్తున్నారన్నారు. సంబంధిత పంటకు నీరు ఎక్కువగా ఉండాలని ఇక్కడ నీటి లభ్యత ఎక్కువగా ఉందని రైతులందరూ ఆయిల్ ఫామ్ పెంచాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టినటువంటి సూపర్ సిక్స్ పథకాలలో ప్రతి ఒక్కటిని అమలు చేస్తూ తన యొక్క మాట నిలబెట్టుకున్నారన్నారు. అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, దీపం – 2 పథకం, మెగా డీఎస్సీ ఇలా ప్రతి ఒక్క పథకం చెప్పింది చెప్పినట్లుగా అమలు చేశారన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ది కి సంబంధించిన మెగా చెక్కును రైతులకు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, ఎల్ డి ఎం రామచంద్ర రావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సాలు రెడ్డి, కర్నూలు రూరల్ తహసిల్దార్ రమేష్, గ్రామ సర్పంచ్ మహానంది, బి.తాండ్రపాడు సర్పంచ్ జయన్న, తదితరులు పాల్గొన్నారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.